నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 20 జూన్ 2025 | VIKARABAD

కేపీహెచ్‌బీ కాలనీలో ఇబ్బడిముబ్బడిగా హాస్టళ్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ జామ్‌లాంటి సమస్యలు తలెత్తడంతో తమ ప్రాంతంలో హాస్టళ్లు కట్టరాదని కాలనీవాసులు ఏర్పాటు చేసిన బ్యానర్

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..!

వసంత్‌నగర్ నుంచి గోకుల్ చౌరస్తామీదుగా హైటెక్ సిటీ వెళ్లే దారిలో రోడ్డు అధ్వానంగా మారింది. రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు , స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైన ఇసుక పేరుకుపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

కన్నీరు పెట్టుకుంటున్నా.. కనికరించరా..?

బడుగుల భూములే సర్కారుకు టార్గెట్..

- భూముల స్వాధీనానికి రాత్రికి రాత్రే నోటిఫికేషన్లు జారీ చేస్తున్న ప్రభుత్వం
- రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 4000 ఎకరాల అసైన్డ్ భూమి సేకరణ
- తాజాగా మరింత భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్లు జారీ
- ప్రజా అవసరాలు అంటూ సాకుగా చూపి.. దళితులు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన అసైన్డ్ భూములను సేకరిస్తున్న సర్కారు
- కొన్నేండ్లుగా ఆ భూములను సాగుచేసుకుని జీవిస్తున్నమంటూ రైతన్నల ఆవేదన
- రోడ్డున పడుతున్న వేలాది మంది అన్నదాతలు

జిల్లాలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన వేలాది ఎకరాలపై ప్రభుత్వం కన్నేసింది. ఎన్నో ఏండ్లుగా ఆ భూములను సాగు చేసుకుని జీవిస్తున్న బక్క రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే రాత్రికి రాత్రే నోటిఫికేషన్లు జారీ చేస్తున్నది. పరిశ్రమలు, కంపెనీలు, సంస్థలు, ప్రజావసరాల పేరుతో వేలాది ఎకరాలను సేకరించేందుకు సిద్ధమైంది. తమ భూములను తీసుకోవద్దని.. వాటినే నమ్ముకుని జీవిస్తున్నామని అన్నదాతలు కన్నీరు పెట్టుకుంటున్నా సర్కారు మాత్రం కనికరించడంలేదు. పోలీసులను ప్రయోగించి బలవంతంగా సేకరిస్తుండడంతో వేలాది మంది అన్నదాతలు రోడ్డున పడాల్సిన దుస్థితి వచ్చింది. అసైన్డ్ పట్టాలు పొంది 30 నుంచి 50 ఏండ్లుగా భూములను సాగు చేసుకుంటున్న రైతులకు సమాచారం ఇవ్వకుండానే ప్రభుత్వం భూములను సేకరిస్తున్నది. ఇప్పటివరకు సర్కారు జారీ చేసిన నోటిఫికేషన్లకు సంబంధిన భూములన్నీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాలకు చెందినవే. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే జిల్లాలో సుమారు నాలుగు వేలకు పైగా ఎకరాల అసైన్డ్ భూములను సేకరించింది. తాజాగా మరిన్ని ఎకరాలను సేకరించేందుకు నోటిఫికేషన్లు జారీ చేసింది.

- రంగారెడ్డి, జూన్ 19 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీ కోసం ప్రభుత్వం వెయ్యి ఎకరాల భూమిని సేకరించింది. కొంగరకలాన్‌లోని ఎగ్జిట్ నం. 13 నుంచి ట్రిపుల్ ఆర్ ఆకుతోటపల్లి వరకు 41 కిలోమీటర్ల పొడవు 330 ఫీట్ల వెడల్పుతో నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు సుమారు 1004 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఈ భూసేకరణతో సన్న, చిన్నకారు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన 4,725 మంది రైతులు రోడ్డున పడాల్సిన దుస్థితి వచ్చింది. భూముల్లేకుండా తాము రోడ్డున పడుతామని అన్నదాతలు ఎంత మొత్తుకున్నా సర్కార్ మాత్రం కనికరించలేదు. పోలీసులను పెట్టి మరీ బలవంతంగా సేకరించి హద్దురాళ్లను ఏర్పాటు చేసింది.

రాత్రికి రాత్రే నోటిఫికేషన్లు

అసైన్డ్ భూముల సేకరణకు ప్రభుత్వం రాత్రికి రాత్రే నోటిఫికేషన్లు జారీ చేస్తున్నది. గత ఆరు నెలల్లో ప్రభుత్వం 8 నోటిఫికేషన్లు జారీచేసింది. గత డిసెంబర్‌లో కందుకూరు మండలంలోని తిమ్మాపూర్‌లో సర్వే నం.88లో 350 ఎకరాలు, సర్వే నం.162లో 2017 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ భూములన్నీ పేద, దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందినవే. అలాగే, ఫిబ్రవరి మొదటి వారంలో మహేశ్వరం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఇండస్ట్రియల్, ఐటీ పార్కు స్థాపన పేరుతో 198 ఎకరాలకు, మార్చి 13న కందుకూరు మండలంలోని తిమ్మాయపల్లిలోని సర్వే నం.9లో 439 మంది రైతుల నుంచి 366 ఎకరాలు, మహేశ్వరం మండలంలోని కొంగరకుర్దు సర్వే నం.289లో 94 మంది నుంచి 277 ఎకరాలు, యాచారం మండలంలోని మొండిగౌరెల్లిలోని సర్వే నం.19, 68, 127లలో 638 మంది రైతుల నుంచి 821 ఎకరాలను సేకరించేందుకు నోటిఫికేషన్ జారీచేసింది. ఈ భూములను 638 మంది రైతులు గత 30-40 ఏండ్లుగా సాగుచేసుకుని జీవిస్తున్నారు. దీంతో వారు లబోదిబోమంటున్నారు.

గోశాలకు రైతుల భూములు

మొయినాబాద్ మండలంలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన సర్వే నం.108లో 99 ఎకరాలను గోశాల నిర్మాణం పేరుతో ప్రభుత్వం తీసుకోవాలని నిర్ణయించింది. ఆ గ్రామానికి చెందిన సుమారు 50 నుంచి 60 మంది రైతులు గత 70 ఏండ్లుగా ఈ భూములను సాగుచేసుకుని జీవిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఆ రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

పోలీసు పహారా మధ్య..

భూసేకరణకు రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతున్నా.. ప్రభుత్వం మాత్రం తన నిర్ణయాన్ని మార్చుకోవడంలేదు. పోలీసుల సహకారంతో రైతులను ఎక్కడికక్కడ అడ్డుకుని భూసేకరణ చేపడుతున్నది. మరికొన్ని చోట్ల రైతులను మభ్యపెట్టి ఆ ప్రక్రియను పూర్తి చేస్తున్నది. తిమ్మాయపల్లిలో సర్కారు చేపట్టిన ఎంజాయ్‌మెంట్ సర్వేలో రైతులంతా స్వచ్ఛందంగా ఇస్తున్నారని చెప్పినా చాలామంది రైతులు వ్యతిరేకిస్తున్నారు. కానీ, వారు తమ నిర్ణయాన్ని బయటికి చెప్పేందుకు ముందుకు రావడంలేదు. భూసేకరణతో జిల్లాలోని పేదలకు భూమిపై హక్కులు లేకుండా పోయే ప్రమాదమున్నది.

గ్రేటర్ రోడ్లపై ఐఆర్‌సీ (ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్) ప్రమాణాలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్‌తో నడుము, మెడ, మోకాళ్ల నొప్పులు, డిస్క్ అరుగుదలతో నరంపై ఒత్తిడి ఇలా అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే పౌరుల నుంచి తీవ్ర స్థాయిలో రంబుల్ స్ట్రిప్స్‌పై వ్యతిరేకత రావడం, నెటిజన్లు మండిపడుతుండడం దృష్ట్యా గ్రేటర్ రహదారులపై ఐఆర్‌సీ ప్రమాణాలు ఏ మేర ఉన్నాయి? రంబుల్ స్ట్రిప్స్ డెంజర్‌గా ఉన్నాయా? జీబ్రా క్రాసింగ్, పాదచారుల భద్రత ఇతర అంశాలపై జీహెచ్‌ఎంసీ ఇటీవల అధ్యయనం చేసింది. రంబుల్ స్ట్రిప్స్, సైనేజ్, మార్కింగ్‌లతో పాటు ట్రాఫిక్ సంబంధిత పనులపై అధ్యయనం చేసిన అధికారులు ఐఆర్‌సీ నిబంధనలు అనుసరించి స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసిజర్ (ఎస్వోపీ)ను అమలు చేయాలని సూచించింది. ఈ మేరకు ఐఆర్‌సీ ప్రమాణాలు కచ్చితంగా పాటించాలంటూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ గురువారం ఇంజినీరింగ్ విభాగానికి ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రమాణాల ప్రకారమే రంబుల్ స్ట్రిప్స్

గ్రేటర్ రోడ్లపై తొలగిపోనున్న సమస్య

- ఐఆర్‌సీ నిబంధనల ప్రకారమే అమలు
- ఎక్కువ మందంతో వెన్నులో వణుకుపుట్టించిన వైనం
- రోడ్లపై అధ్యయనం చేసిన అధికారులు
- ఎస్వోపీని అమలు చేయాలంటూ కమిషనర్ తాజా ఉత్తర్వులు

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : స్పీడ్ బ్రేకర్లతో ప్రమాదాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో వాటికి ప్రత్యామ్నాయంగా జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్ ప్రయాణికులకు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. ఐఆర్‌సీ ప్రమాణాలను ఉల్లంఘిస్తూ ఇష్టారీతిన వీటిని ఏర్పాటు చేశారు. ఐఆర్‌సీ మార్గదర్శకాల ప్రకారం.. జాతీయ, రాష్ట్ర రహదారులపై రంబుల్ స్ట్రిప్స్ ఎత్తు 5 మిల్లీ మీటర్లు 300 మి.మీ. వెడల్పు, 600 మి.మీ. స్పేస్, ఆరు స్ట్రిప్‌తో ఉండాలి. పోలీస్ శాఖ ఆదేశాలతో మేరకు చాలా చోట్ల రహదారులపై 10, 15 ఎంఎం మందంతో ఉన్నాయి. అడుగుకు ఒకటి చొప్పున ఒక్కో ప్రాంతంలో ఆరు స్ట్రిప్స్ మాత్రమే ఉండాలి. కానీ చాలా ప్రాంతాల్లో 7.5 నుంచి 10 మి.మీ. మందంతో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కువ మందం, రెట్టింపు స్ట్రిప్స్‌తో కుదుపునకు గురవుతుండడంతో వాహనాలతోపాటు పౌరుల ఆరోగ్యం పాడవుతుందని, కార్యాలయాల్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లపై, ఎక్కువ సమయం కూర్చొని ఇతరత్రా పనులు చేసేవారిలో చాలామంది స్పాండిలైటిస్, వెన్నువొప్పి వంటి సమస్యలతో బాధపడుతుంటారని, ఇలాంటివారికి రంబుల్ స్ట్రిప్స్‌తో ఇబ్బందులు అధికమవుతాయని వైద్యులు, పౌరుల నుంచి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. అధికంగా బంజారాహిల్స్ రోడ్ నం.3 లోని ఓ మసీదు వద్ద, పంజాగుట్ట నుంచి బేగంపేట వైపు వెళ్లే మార్గంలో, హబ్సిగూడ, మెహిదీపట్నం, నిజాం కాలేజీ హాస్టల్ నుంచి సీసీఎస్, అసెంబ్లీ వద్ద, ఐఎస్‌బీ రోడ్‌లో రంబుల్ స్ట్రిప్స్‌పై అత్యధిక ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలోనే. సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు రోజురోజుకు విరుచుపడుతుండడంతో ఎట్టకేలకు జీహెచ్‌ఎంసీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. కొత్త రోడ్లపై ఐఆర్‌సీ ప్రమాణాలు పక్కాగా పాటించడంతో పాటు ప్రస్తుతమున్న రంబుల్ స్ట్రిప్స్ కాలగమనంలో మందం తగ్గి సాధారణంగా మారనున్నాయి.

ప్రధానంగా ఎస్‌వోపీ ప్రకారం రోడ్ మార్కింగ్, సైనేజ్, రోడ్ కర్వ్ (మూల మలుపులు సూచించే బోర్డులు), జీబ్రా క్రాసింగ్‌లు, స్కూల్ జోన్స్, హాస్పిటల్ జోన్స్, సైకిల్ ట్రాక్‌లు, బస్ బేలు, ఆన్ స్ట్రీట్ పార్కింగ్, ఆఫ్ స్ట్రీట్ పార్కింగ్, ఏరియల్ రోడ్లు, రహదారులపై స్పీడ్ లిమిట్ , ఓవర్ టేకింగ్ సైన్ , పాదచారుల క్రాసింగ్ సూచించే గుర్తులను కచ్చితంగా అమలు చేయనున్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

>IVలో

దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వివరాల నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూన్ 19 : భూసమస్యలను సాధ్యమైనంత వరకు రెవెన్యూ సదస్సుల్లోనే పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులపే ఆదేశించారు. గురువారం మండలంలోని అత్వెల్లి గ్రామం, వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని కొత్రేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి.. అర్జీదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివరాల నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తుల వివరాలను రిజిస్టర్లలో తప్పనిసరిగా ఎంట్రీ చేయాలన్నారు. సమస్యల వారీగా అర్జీలను విభజించి.. పక్కాగా రికార్డులను పొందుపర్చాలన్నారు. ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తునూ స్వీకరించాలని.. తహసీల్దార్ స్థాయిలో ఉండేవాటిని వెంటనే పరిష్కరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్వో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో డెంగీ కలకలం

20రోజుల్లో 12కేసులు నమోదు

విజృంభిస్తున్న దోమలు

నిద్రావస్థలో జీహెచ్‌ఎంసీ అధికారులు

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): నగరంలో వానలు మొదలవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. గతం కంటే ఈసారి వారం పది రోజుల ముందే వర్షాలు కురవడంతో గ్రేటర్‌తో పాటు నగరంలో సాయంత్రం కాగానే దోమల దండయాత్ర మొదలవుతోంది. వర్షాల కారణంగా గాలిలో తేమ శాతం పెరగడంతో వాతావరణం కొంత చల్లబడింది. దీంతో జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలతో కూడిన సీజనల్ వ్యాధులు మొదలయ్యాయి. గడిచిన 20రోజుల్లో హైదరాబాద్ నగరంలోనే 12కేసులు నమోదవడం కలకలం రేపుతున్నది. ఈ కేసుల్లో అత్యధికంగా పాతబస్తీలోనే నమోదైనట్లు సమాచారం. వర్షాకాలం ప్రారంభానికి ముందే జీహెచ్‌ఎంసీలోని ఎంటమాలజీ విభాగం అధికారులు దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడంతో పరిస్థితి చేయిదాటే వరకు వచ్చింది. దోమల కారణంగా డెంగీ, మలేరియా, చికున్‌గున్య వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. కరోనా అలజడి సమయంలో ఒకే లక్షణాలు కలిగిన డెంగీ కేసులు నమోదవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

ముందస్తు చర్యలేవి..?

దోమలు వృద్ధిచెందకుండా ఉండేందుకు యాంటీలార్వా, ఫాగింగ్ తదితర చర్యలు చేపట్టాలి. బస్తీలు, కాలనీలు, ముఖ్యంగా మురికి వాడల్లో కాలువలు, కుంటలు, నాలాల్లో దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలి. కానీ సంబంధిత జీహెచ్‌ఎంసీ, ఎంటమాలజి విభాగం అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. వర్షాలు కురవడంతో దీని వల్ల దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు లేకపోలేదని వాపోతున్నారు వైద్యులు. మూడురోజులైనా జ్వరం, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించి, సంబంధిత వైద్యపరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అంతేకాకుండా దోమల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటితో పాటు ఇంటి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నారు.

నిలిచిన చెత్త సేకరణ

- బిల్లులు మంజూరు చేయాల్సిందిగా అధికారులకు మొర పెట్టుకున్న పంచాయతీ కార్యదర్శులు
- సొంత డబ్బులను ఎవరు ఖర్చు చేయమన్నారని పేర్కొన్న వైనం
- ట్రాక్టర్‌ల నిర్వహణ సాధ్యం కాదంటూ ఎంపీడీవోలకు తాళం చేతులు ఇచ్చేసిన కొంతమంది కార్యదర్శులు
- ఇదే బాటలో మరికొంతమంది
- అధికారుల తీరుతో సమస్య మరింత జటిలం

పరిగి, జూన్ 19 : పచ్చదనానికి, పరిశుభ్రతకు నిలయంగా గ్రామాలను తీర్చిదిద్దడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలివ్వగా కాంగ్రెస్ ప్రజా పాలనలో ఏకంగా చెత్త సేకరణ వ్యవస్థ కుప్పకూలింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికే గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయి. ఇటీవల పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారుల మాట తీరుతో నొచ్చుకున్న పంచాయతీ కార్యదర్శులు ఆర్థికపరమైన విధులను బహిష్కరిస్తున్నట్లు పేర్కొంటూ ట్రాక్టర్ల తాళం చేతులు మండలాభివృద్ధి అధికారులకు అప్పగించారు. వికారాబాద్ జిల్లా పరిధిలో 595 గ్రామపంచాయతీలున్నాయి. ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దాలనే సత్సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతి గ్రామపంచాయతీకి ఒక ట్రాక్టర్, ట్యాంకర్‌ను సైతం ఏర్పాటు చేయించడం జరిగింది. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరిపి ట్రాక్టర్ ద్వారా చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తీసుకువెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేయడంతోపాటు కంపోస్టు ఎరువు తయారీకి రూపకల్పన చేసి అమలు చేసింది. ప్రభుత్వ విధానంతో గ్రామాలలో చెత్త సమస్య పరిష్కారమవడంతోపాటు రోడ్లపై చెత్త వేసేవారు కాదు.

అధికారుల తీరుతో అడ్డం తిరిగిన కథ

తమకు ఏడాదికిపైగా రావాల్సిన బిల్లులు మంజూరు చేయాల్సిందిగా పంచాయతీ కార్యదర్శులు అధికారులకు మొరపెట్టుకోగా మిమ్మల్ని ఎవరు ఖర్చు చేయమన్నారు, మేము చెప్పామా అంటూ పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఓ రాష్ట్ర స్థాయి అధికారి, జిల్లాలో పనిచేసే మరో అధికారి పేర్కొనడంతో ఆశ్చర్యపోవడం కార్యదర్శుల వంతైంది. ఏడాదికిపైగా వివిధ పనుల కోసం తాము ఖర్చు చేసిన డబ్బులు మంజూరు చేయకపోవడం అటుంచి.. మిమ్మల్ని ఎవరు చేయమన్నారంటూ ఉన్నతాధికారులే మాట్లాడడంతో అవాక్కైన పంచాయతీ కార్యదర్శులు ఇకమీదట ఆర్థికపరమైన విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయా మండలాలవారీగా పంచాయతీ కార్యదర్శులు సమావేశాలు నిర్వహించుకొని ఆర్థికపరమైన విధుల నిర్వహణ తమవల్ల కావడం లేదని, వాటిని బహిష్కరిస్తున్నట్లు పేర్కొంటూ ట్రాక్టర్ల తాళం చేతులు ఎంపీడీవోలకు అందజేయడం ప్రారంభించారు. జిల్లా పరిధిలో ఇప్పటికే పలు మండలాల్లో గ్రామపంచాయతీ ట్రాక్టర్ల తాళం చేతులు అధికారులకు అందజేయగా.. మిగతా మండలాలు అదే బాటలో ఉన్నాయి. ప్రతి రోజూ లేదా రోజు తప్పించి రోజు తమ ఇళ్ల దగ్గరకు వచ్చి చెత్త సేకరణ చేసే ట్రాక్టర్ రావడం లేదని ఆయా గ్రామాలవారు వాపోతున్నారు. చెత్త సేకరణ నిలిచిపోగా, ఈ వ్యవస్థ పునరుద్ధరణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి మరో వారం పది రోజులు కొనసాగితే గ్రామాలు కంపుకొడతాయని ఆయా గ్రామాలవారు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయత్నించగా.. నేడు చెత్త సేకరణ వ్యవస్థ కుప్పకూలమేంటటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సర్కారు వెంటనే చర్యలు చేపట్టి బిల్లులు విడుదల చేసి తిరిగి గ్రామాల్లో చెత్త సేకరణ వ్యవస్థ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏడాదికి పైగా అందని బిల్లులు

సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిన తర్వాత 2024 ఫిబ్రవరి నుంచి పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో అన్ని పనులు చేపడుతూ వచ్చారు. పంచాయతీ సిబ్బందికి వేతనాలు రాకపోయినా తమ సొంత డబ్బులతో పని చేయించారు. గ్రామాల్లో చెత్త సేకరణ వ్యవస్థ సజావుగా నడిచేందుకు ట్రాక్టర్లకు డీజిల్ పోయించి కొనసాగించారు. ఇతర చిన్నచిన్న పనులు కూడా చేయించగా.. వారికి రావాల్సిన బిల్లులు ఇప్పటికీ అందలేదు. గత సంవత్సరం వేసవి కంటే ముందుగానే గ్రామ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో వేసవిలో మంచినీటి సమస్య పరిష్కారానికి సంబంధించి కాలిపోయిన బోరు మోటార్లు బాగు చేయించడం, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతు పనులు చేయించారు. ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి డబ్బులు వస్తాయని అధికారులు చెప్పడంతో పనులు చేయించి, ఎంబీ రికార్డులు పూర్తయినా ఏడాదికాలంగా తమకు డబ్బులు రాలేదని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఒక్కో గ్రామపంచాయతీలో రూ.50వేలకు పైగానే ఖర్చు చేసినా నేటికీ డబ్బులు రాలేదన్నారు. ప్రతి నెల చెత్త సేకరణ, మొక్కలకు నీరు పోసేందుకు ఉపయోగించడానికి ట్రాక్టర్‌కు డీజిల్, నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. పాలకవర్గాలు లేక కేంద్రం నుంచి నిధులు రావడం లేదని, దీంతో ఏ పని చేయాలన్నా ఇబ్బందిగా మారిందని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

- మద్యం మత్తులో వాహనాల డ్రైవర్లు
- నిబంధనలు పాటించని విద్యాసంస్థలు
- ఆర్టీఏ అధికారుల సూచనలు బేఖాతర్
- ఫిట్‌నెస్ పరీక్షకు రాని 3వేల బస్సులు

స్కూల్ బస్సులు.. ఎంత సేఫ్!

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : బడిపిల్లల ప్రాణాలు డ్రైవర్లచేతుల్లో ఉన్నాయడనంలో ఎలాంటి సందేహం లేదు. విద్యా సంస్థల బస్సులు నడిపే డ్రైవర్లు మద్యం తాగి నడిపిస్తున్నారు. ఈ నిర్లక్ష్యం పిల్లల ప్రాణాలతో చెలగాటలాడమే అవుతుందని తల్లిదండ్రులు విద్యా సంస్థల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీఏ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా విద్యా సంస్థలు చెలరేగిపోతున్నాయి. గ్రేటర్‌లో 13,502 విద్యా సంస్థల బస్సులు ఉన్నాయి. హైదరాబాద్‌లో 1247, మేడ్చల్ మల్కాజిగిరిలో 6058, రంగారెడ్డిలో 6197 బస్సులు ఉన్నాయి. వీరికి ఆర్టీఏ ప్రతి స్కూల్ ప్రారంభానికి ముందు రోడ్ సేఫ్టీ, డ్రైవర్ల నియామక సామర్థ్యం, ప్రమాదాలు జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, బస్సు కండీషన్, ఆ బస్సుపై ఉండాల్సిన రంగులు, అక్షరాలు తదితర అన్నీ అంశాలపై సూచనలు ఇస్తారు. కానీ ఈ సారి ఆర్టీఏ అధికారులు వారికి సూచనలు చేసినప్పటికీ విద్యా సంస్థల నిర్వాహకులు తమదారి తమదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. రోజు వారి కూలీగా డ్రైవర్లను నియమించుకుని ఎటువంటి అనుభవం లేకున్నా చేతికి స్కూల్ బస్సును ఇచ్చేస్తున్నారు. ఆ బస్సును నడపడానికి వాళ్లంతా మద్యం తాగి రోడ్డుపై ఉరికిస్తున్నారు. ఇలా పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 3వేల విద్యా సంస్థల బస్సులు అసలు ఫిట్‌నెస్ పరీక్షకే రాలేదని అధికారులు చెబుతుండటం ఆందోళన కలిగిస్తుంది.

ఇవి పాటించాల్సిందే..!

* రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ), వ్యాలిడ్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, వ్యాలిడ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ట్యాక్స్ పేమెంట్ రశీదు(బకాయిలు లేకుండా), పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్, డ్రైవింగ్ చేసే డ్రైవర్ లైసెన్సు తప్పక వాహనంతో ఉండాలి.
* ప్రభుత్వ సూచనల మేరకు ఐదు రకాల వాహనాల వేగానికి కళ్లెం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో విద్యా సంస్థల బస్సులు కూడా ఉన్నాయి. ఫిటెనెస్‌కు ముందే ఆయా వాహనాల్లో వేగ నియంత్రణ పరికరాలు ఉండేలా చూడాల్సి ఉంటుంది.
* తెలంగాణ మోటార్ వెహికల్ రూల్స్ 1989 ప్రకారం రూల్‌నంబర్ 186జీ ప్రకారం తెలంగాణలో విద్యాసంస్థల బస్సులు పూర్తి పసుపు రంగులో ఉండాలి. ఆ బస్సుపై పెద్ద అక్షరాలతో స్కూల్ బస్సు అని రాయడం తప్పనిసరి.
* వాహనం డ్రైవర్ 60 సంవత్సరాలకు మించి ఉండరాదు. డ్రైవర్‌కు సంబంధించిన ఆరోగ్య వివరాలు బస్సులో అతికించాలి.
* కనీసం ఐదు సంవత్సరాలు డ్రైవింగ్ అనుభవం ఉండాలి.
* వాహనంలో ఫిర్యాదుల పట్టికను ఏర్పాటు చేసి ఫిర్యాదులను ప్రతి నెలకు ఒక సారి పరిశీలించాలి.
* ప్రతి వాహనంలో అత్యవసర ద్వారం పెట్టాలి. పెద్ద అక్షరాలతో రాయించాలి. వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి.
* ప్రతి బస్సులో విద్యార్థుల పేర్లు, ఇంటి చిరునామా, తరగతులు, దిగాల్సిన ప్రదేశం పేర్ల పట్టికతో పాటు రూట్ మ్యాప్ తప్పనిసరి
* విద్యార్థులు బస్సు ఎక్కడం, దిగడం విషయాన్ని గ్రహించేందుకు కన్వెస్ట్ క్రాస్ అద్దాలుండాలి. ప్రతి బస్సులో కూర్చున్న విద్యార్థులు డ్రైవర్‌కు కన్పించేలా పెద్ద అద్దం పెట్టాలి.
* బస్సులు సీట్ల కింద విద్యార్థుల బ్యాగులు పెట్టునేందుకు అరలు ఏర్పాటు చేయాలి
* రవాణా శాఖ ఇచ్చే శిక్షణలో డ్రైవర్ పాల్గొనాల్సి ఉంటుంది. సంవత్సరానికి ఒక సారి విద్యార్థులతో రోడ్ సేఫ్టీ డేను నిర్వహించాలి.